క్లుప్తంగా

లైఫ్ జాకెట్ల పంపిణీ

మల్దకల్: మండలంలోని తాటికుంట రిజర్వాయర్‌లో చేపల వేటకు వెళ్లే మత్స్యకారులకు సోమవారం ఎస్‌ఐ నందికర్ లైఫ్ జాకెట్లు పంపిణీ చేశారు. సొంత డబ్బులతో కొనుగోలు చేసి మత్స్యకారులకు అందజేసినట్లు ఆయన తెలిపారు. ఇటీవలే చేపల వేటకు వెళ్లి దంపతులు మృత్యువాత పడిన విషయం తెలిసిందే. అలాంటి సంఘటనలు పునరావృత్తం కాకుండా ఉండేందుకు మత్స్యకారులకు లైఫ్ జాకెట్లు అందజేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ చంద్రశేఖర్ రెడ్డి, తిప్పారెడ్డి, ఇస్మాయిల్, శ్రీను, గోపాల్, వెంకటన్న, బడెన్న, భీముడు తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం



మానవపాడు: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం పదోన్నతి పొందిన రాంమూర్తి, మౌలాలి, విజయమ్మ, రామేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డిని ఎంఈఓ శివప్రసాద్ ఆధ్వర్యంలో సన్మానించారు. శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

రైలు నుంచి పడి యువకుడికి గాయాలు

మానవపాడు: రైలు నుంచి కిందపడి వ్యక్తి గాయపడిన ఘటన మండల కేంద్రంలోని రైల్వే స్టేషన్ సమీపంలో సోమవారం జరిగింది. స్థానికులు, 108 అంబులెన్స్ సిబ్బంది తెలిపిన వివరాలు.. గుంతకల్ నుంచి హైదరాబాద్ వెళ్తున్న ప్యాసింజర్ రైలు నుంచి మానవపాడు స్టేషన్ సమీపంలో తాటికుంటకు చెందిన జీవరాజ్ కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఈఎంటీ రేణుక, పైలెట్ దేవేందర్ ప్రథమ చికిత్స అందించి మెరుగైన వైద్యం కోసం కర్నూలు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించినట్లు పేర్కొన్నారు.

అదుపుతప్పిన కారు.. ఇద్దరికి గాయాలు



ఉండవెల్లి: మండలంలోని జాతీయ రహదారిపై కడప నుంచి షాద్‌నగర్ వైపు ప్రయాణిస్తున్న కారు టైరు పేలడంతో అదుపతప్పి బోల్తా పడింది. ప్రమాదంలో కారులో ఉన్న భార్యాభర్తలు హరి, శ్రీవాణి గాయపడ్డారు. బాధితులను కర్నూలు ఆస్పత్రికి తరలించినట్లు స్థానికులు పేర్కొన్నారు.

కార్మికులకు రుణమాఫీ చేయాలి

రాజోళి: చేనేత కార్మికులకు ప్రభుత్వం రుణమాఫీ చేయాలని జెడ్పీ కోఆప్షన్ మాజీ సభ్యుడు నిషాక్ సోమవారం ఒక ప్రకటనలో కోరారు. గత నెలలో కార్మికులకు రుణమాఫీ కావాల్సి ఉండగా నేటి వరకు చేయలేదనన్నారు. దీంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. చేనేత కార్మికుల వివరాలు, బ్యాంకు సంబంధిత ప్రక్రియను అధికారులు పూర్తి చేసినా రుణాలు మాఫీ మాత్రం వాయిదా పడుతూనే ఉందన్నారు. వీలైనంత త్వరగా చేనేత కార్మికులకు రుణాలు మాఫీ చేయాలని పేర్కొన్నారు.

క్షయను ఆదిలోనే అరికట్టాలి

అలంపూర్ రూరల్: క్షయవ్యాధిని ఆదిలోనే అరికట్టాలని వైద్య సిబ్బంది అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు టీబీ కార్యక్రమాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నాయన్నారు. సోమవారం మండలంలోని బైరాపురం, బస్వాపురం, సింగవరం ఆరోగ్య ఉప కేంద్రాల్లో పరీక్షలు నిర్వహించారు. క్షయ వ్యాధిగ్రస్తులకు ఉచిత వైద్యంతో పాటు ఆర్థిక సహాయం అందుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో నాగశేషయ్య, విజయ, మంజుల, ఇందుభాయ్, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

పైప్‌లైన్ లీకేజీతో అంతరాయం

గద్వాల: ధరూరు మండలంలో 1200 ఎంఎం మిషన్ భగీరథ పైప్‌లైన్ లీకేజీతోపాటు అయిజ మండలం వద్ద డీఐ 600 ఎంఎం పైప్‌లైన్ మారుస్తున్న నేపథ్యంలో సోమవారం తాగునీటి సరఫరాలో అంతరాయం ఏర్పడినట్లు డీఈ రవిచంద్రకుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం మధ్యాహ్నం నుంచి నీటి సరఫరా యథావిధిగా పునరుద్ధరించనునట్లు పేర్కొన్నారు.



గద్వాల- రాయచూర్ రహదారిలోని పారుచర్ల స్టేజీ సమీపంలో చెట్లను నరికేయడంతో ఖాళీగా కనిపిస్తున్న దృశ్యం



ప్రాజెక్ట్ దారిలో చిన్నపాడు స్టేజీ వద్ద నరికివేసిన చెట్లు

యథేచ్ఛగా చెట్ల నరికివేత



ధరూరు వైపు నుంచి ట్రాక్టర్‌లో గద్వాలకు తరలుతున్న కలప(ఫైల్)

- రెచ్చిపోతున్న అక్రమార్కులు
- ప్రభుత్వ లక్ష్యానికి తూట్లు
- రాత్రికి రాత్రే నరికేస్తున్న వైనం
- అధికారుల తీరుపై ప్రజల ఆగ్రహం

ధరూరు: వృక్షో రక్షతి రక్షితః అంటారు. కానీ మండలంలో వృక్ష సంపద చాప కింద నీరులా రోజురోజుకు అంతరించిపోతున్నా పట్టించుకునే నాథుడే కరువయ్యారని మండల ప్రజలు ఆవేదనవ్యక్తం చేస్తున్నారు. కట్టెల వ్యాపారాన్ని మూడు చెట్లు, ఆరు బంగ్లాలుగా మలుచుకుంటున్నారు. అడవులు, రోడ్లు, రైతుల పొలాల్లో ఉన్న చెట్లను నరికి కలపను నిత్యం తరలిస్తున్నా అధికారులు చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపిస్తున్నారు.

ఆర్‌అండ్‌బీ స్థలాల్లోని చెట్లు..

మండలంలో కళ్ల ముందే కలప తరలిస్తున్నా అధికారులు చర్యలు తీసుకోవడం లేదని ఆయా గ్రామాల ప్రజలు ప్రశ్నిస్తున్నారు. గద్వాల- రాయచూర్, గద్వాల- నారాయణపేట, ఆత్మకూరు మార్గంలోని ఆర్‌అండ్‌బీ శాఖ ఆధీనంలోని ఉన్న చెట్లను వ్యాపారులు వదలట్లేదు. రోడ్డు పక్కన ఉన్న పొలాలు ఉన్న రైతులు చెట్ల నీడతో పంట సరిగా రావడం లేదంటూ రైతులు చెట్లను మట్టబెడుతున్నారు. ధరూరు నుంచి పారుచర్ల స్టేజీ వరకు రెండున్నర దశాబ్దాల క్రితం వేసిన చెట్లను దాదాపుగా నరికేశారు. కళకళలాడాల్సిన రోడ్లు నేడు కళ విహీనంగా కనిపిస్తోంది. దీనిపై ఆ శాఖ అధికారుల పర్యవేక్షణ లేకపోవడమే ఇందుకు కారణంగా తెలుస్తోంది.

నీరుగారుతున్న ప్రభుత్వ లక్ష్యం

ప్రభుత్వం మొక్కల పెంపకానికి వనమహోత్సవం పేరుతో రూ.కోట్లు ఖర్చు చేస్తుంటే.. కలప దందా వ్యాపారులు మాత్రం చెట్ల కలప తరలించడాన్ని వదలడం లేదు. గతేడాది ఇదే మాసంలో డ్యాం రూట్లో భీంపురం, చిన్నపాడు స్టేజీ వద్ద కొందరు గుర్తు తెలియని వ్యాపారులు రాత్రికి రాత్రే చెట్లను నరికి తరలించారు. అయినా కలప దొంగలపై చర్యలు తీసుకోవడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

సమన్వయ లోపం

ఆర్‌అండ్‌బీ, ఫారెస్టు అధికారుల మధ్య సమన్వయం లోపం చెట్ల నరికివేతకు కారణమవుతోంది. ఇది మా పరిధిలోకి రాదు, అది మా పరిధిలోకి రాదు అంటూ మీనమేషాలు లెక్కిస్తున్నారని, దీంతో కలప అక్రమార్కులు రెచ్చిపోతున్నారని మండల ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెట్లను నరకకుండా చూడాలి

ప్రభుత్వ స్థలాలు, రోడ్ల వెంట ఉన్న చెట్లను నరికే వారిపై అధికారులు నిఘా ఉంచాలి. చెట్లు అంతరించిపోకుండా చర్యలు చేపట్టాలి. రోడ్లకు ఇరు వైపులా ఉన్న చెట్లు లేని ప్రాంతాల్లో తిరిగి చెట్లు నాటించే కార్యక్రమం చేపట్టాలి.

– లేమిరాజ్, ధరూరు

మా దృష్టికి రాలేదు

మా పరిధిలో ఉన్న చెట్లను నరికినట్లు మా దృష్టికి రాలేదు. తమ శాఖకు సంబంధించి గద్వాల– రాయచూర్ రోడ్డు మార్గం గుండా వర్క్ ఇన్‌స్పెక్టర్లను పంపించి చెట్లను నరకకుండా చర్యలు తీసుకుంటాం. డ్యాం రూట్ ఇరిగేషన్ శాఖ పరిధిలోకి వస్తుంది.

– రామకృష్ణ, ఆర్‌అండ్‌బీ జేఈ

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అవగాహన కల్పిస్తున్న బీజేపీ నాయకులు

అయిజ: పెట్రోల్ పంపుల వద్ద మోసాలకు గురికాకుండా ప్రజలు అప్రమత్తంగా ఉండాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు భగత్‌రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని మేడికొండ రోడ్డులో పెట్రోల్ బంకుల వద్ద వినియోగదారుల హక్కుల గురించి ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా భగత్‌రెడ్డి మాట్లాడారు. పలు బంకుల్లో కల్తీ ఇంధనం కలపడం, నకిలీ క్యూఆర్ కోడ్ మోసాలు జరుగుతున్నాయన్నారు. ప్రతి బంక్ వద్ద శుభ్రమైన తాగునీరు, టైర్లకు ఉచితంగా గాలి నింపే సదుపాయం తదితర సేవలు అందించాలన్నారు ధరల పట్టిక ఉండాలని, డిజిటల్ పేమెంట్ సదుపాయం తప్పనిసరిగా ఉండాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు లక్ష్మణాచారి, జిల్లా కౌన్సిల్ సభ్యులు ప్రదీప్‌కుమార్, పట్టణ ఉపాధ్యక్షుడు లక్ష్మణ్‌గౌడ్, నాగరాజు, మాధవాచారి, నవీన్, అజయ్ దేవన్న తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయాలని వినతి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

ఎర్రవల్లి: ప్రభుత్వం ఇచ్చిన ప్లాట్లకు నకిలీ పట్టాలను సృష్టించి విక్రయించిన వారిపై చర్యలు తీసుకొని బాధితులకు న్యాయం చేయాలని బీజేపీ నాయకులు కోరారు. సోమవారం బీజేపీ మండలాధ్యక్షుడు జగదీష్‌రెడ్డి ఆధ్వర్యంలో తహసీల్దార్ నరేష్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. మండలంలోని వేముల గ్రామంలో 1996 నుంచి 2001 వరకు ప్రభుత్వం దాదాపు 50 మంది లబ్ధిదారులను గుర్తించి ఒక్కొక్కరికి 5 సెంట్ల ఇంటి స్థలాలను కేటాయించిందన్నారు. కానీ అదే గ్రామానికి చెందిన కొందరు బకాసురులు ప్రభుత్వం ఇచ్చిన ఐదు సెంట్లను మూడు సెంట్లుగా మార్చి మిగిలిన రెండు సెంట్ల ప్లాట్లతో పాటు బాధితులకు ఇచ్చిన ప్లాట్లకు సైతం నకిలీ పట్టాలను సృష్టించారని ఆరోపించారు. కాసులకు కక్కుర్తిపడి ఆ ప్లాట్లను విక్రయించినట్లు పేర్కొన్నారు. అధికారులు స్పందించి తక్షణమే బాధితులకు న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో గ్రామస్తులు చాకలి కోనన్న, తిక్కమ్మ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

సమన్వయంతో ముందుకు సాగాలి



మాట్లాడుతున్న ఎంపీడీఓ చెన్నయ్య

గట్టు: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఆడిట్ బృందాన్ని సమన్వయం చేసుకొని ముందుకు సాగాలని ఎంపీడీఓ చెన్నయ్య సూచించారు. సోమవారం మండల పరిషత్ కార్యాలయంలో ఆడిట్ బృందంతో పాటు పంచాయతీ కార్యదర్శులు, మేట్లు, ఉపాధి అధికారులతో సమన్వయ సమావేశం నిర్వహించారు. 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు మొత్తం 1,563 పనులు నిర్వహించగా, రూ.5.80 కోట్ల నిధులు ఖర్చు పెట్టారని తెలిపారు. ఈ పనులకు సంబంధించి ఆడిట్‌ను నిర్వహించేందుకు ఆడిట్ బృందం చేరుకున్నట్లు పేర్కొన్నారు. ఆడిట్ బృందానికి పూర్తిగా సహకరించాలని ఎంపీడీఓ సూచించారు. కార్యక్రమంలో ఏపీఓ స్వామి, సిబ్బంది పాల్గొన్నారు.

ఎంపీడీఓ కార్యాలయం ప్రారంభమెప్పుడో ?



వడ్డేపల్లి ఎంపీడీఓ నూతన కార్యాలయం

శాంతినగర్: వడ్డేపల్లి ఎంపీడీఓ కార్యాలయం ఎప్పుడు ప్రారంభిస్తారని మండల ప్రజలతో పాటు అధికారులు ఎదురు చూస్తున్నారు. దశాబ్దాల క్రితం నిర్మించిన ఆర్డీఎస్ పాత భవనాల్లో ప్రస్తుతం ఎంపీడీఓ కార్యాలయం నిర్వహిస్తున్నారు. శిథిలావస్థకు చేరిన భవనం పైకప్పు వర్షాలకు నీరు కారడంతో ప్రజలతో పాటు సిబ్బంది ఇబ్బందులకు గురవుతున్నారు. నూతన భవనానికి 2016లో రూ.కోటి నిధులు మంజూరయ్యాయి. పనులు ప్రారంభించిన కాంట్రాక్టర్ బిల్లులు రావడం లేదని పనులు ఆపేశాడు. కొంతకాలం తరువాత తిరిగి పనులు చేపట్టాడు. పనులు పూర్తయినప్పటికీ బిల్లులు రాకపోవడంతో భవనం ప్రారంభానికి నోచుకోవడం లేదు. ఈ విషయమై పంచాయతీ రాజ్‌శాఖ అధికారులు స్పందించి బిల్లులు మంజూరు చేసి కార్యాలయాన్ని ప్రారంభించాలని ప్రజలతో పాటు అధికారులు కోరుతున్నారు.

జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక



ఉపాధ్యాయులతో పోటీలకు ఎంపికైన విద్యార్థులు

ఉండవెల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఎస్‌జీఎఫ్ 69వ మండల స్థాయి కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ క్రీడలు నిర్వహించారు. సోమవారం మండలంలోని పలు పాఠశాలలకు చెందిన 100 మంది విద్యార్థులు అండర్–14, అండర్–17 పోటీల్లో పాల్గొన్నారు. 40 మంది విద్యార్థులు జిల్లాస్థాయికి ఎంపికై నట్లు పీడీ శైలజ తెలిపా రు. కార్యక్రమంలో హెచ్‌ఎం హేమలత, పీఈటీలు శ్రీనువాసులు, రాధమ్మ, తదితరులు పాల్గొన్నారు.

మాలలను అణచివేసేందుకు కుట్ర

- జీఓ 99 ప్రతుల దగ్ధం, ఎమ్మెల్యేకు వినతి



ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న మాల మహానాడు నాయకులు

అలంపూర్: మాల జాతిని అణచి వేయాలన్న కుట్రలో భాగంగానే జీఓ 99 తెచ్చారని జాతీయ మాల మహానాడు నియోజకవర్గ ఇన్‌చార్జ్ రజినిబాబు ఆరోపించారు. అలంపూర్ చౌరస్తాలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం వద్ద జాతీయ మాలమహానాడు ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జీఓ నంబర్ 99 ప్రతులను దగ్ధం చేశారు. ఈ సందర్భంగా రజినిబాబు మాట్లాడుతూ.. దళితుల ఐక్యత ఔన్నత్యానికి కృషి చేసిన రాజ్యంగా నిర్మాత డాక్టర్ అంబేడ్కర్ జయంతి రోజే దళిత జాతికి అన్యాయం చేశారన్నారు. దళితుల ఐక్యతను దెబ్బతీసే ఎస్సీ వర్గీకరణ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం అమల్లోకి తెచ్చిందన్నారు. ఎస్సీ వర్గీకరణ చట్టంతో మాల జాతికి కేవలం 5 శాతం రిజర్వేషన్ కల్పించిందన్నారు. అంతేకాక జీఓ నంబర్ 99 ప్రకారం మాలలకు రోస్టర్ పాయింట్ 22 ఇవ్వడం దారుణమన్నారు. కేవలం మాల జాతిని అణిచివేయాలనే కుట్రలో భాగంగానే జరిగిందని ఆరోపించారు. ఈ విషయంపై అసెంబ్లీలో మరోసారి చర్చ జరపాలని కోరారు. అనంతరం ఎమ్మెల్యే విజయుడుకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి తుమ్మల రవికుమార్, హరీష్‌బాబు, భాస్కర్, నాగరాజు, ఎర్రన్న, వెంకటేశ్వర్లు, విజయ్, పరశురాముడు తదితరులు పాల్గొన్నారు.

బీచుపల్లిలో ప్రత్యేక పూజలు

ఎర్రవల్లి: బీచుపల్లి పుణ్యక్షేత్రంలోని శివాలయంలో సోమవారం ప్రధాన అర్చకులు అభిషేకాలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో బీచుపల్లికి చేరుకొని స్వామిని దర్శించుకున్నారు. తీర్థప్రసాదాలు స్వీకరించి మొక్కులు తీర్చుకున్నారు.

రోడ్లపై పారుతున్న మురుగు



ఇటిక్యాల: గ్రామాల్లో పారిశుద్ధ్య నిర్వహణ అస్తవ్యస్తంగా మారిందని ప్రజలు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని అంబేడ్కర్ కాలనీలో మురుగు రోడ్లపై పారుతుండటంతో అవస్థలు పడుతున్నట్లు వాపోతున్నారు. దుర్వాసన భరించలేక తీవ్ర ఇబ్బందులు గురవుతున్నామన్నారు. మురుగు నిల్వ ఉండడంతో దోమలు, ఈగల వ్యాప్తి చెందుతున్నాయని పేర్కొన్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

బాలకార్మిక వ్యవస్థ రూపుమాపాలి



రైతులతో మాట్లాడుతున్న చైల్డ్‌లైన్ సభ్యులు

మల్దకల్: బాలకార్మిక వ్యవస్థను రూపుమాపాలని చైల్డ్‌లైన్ కౌన్సిలర్ జయన్న అన్నారు. సోమవారం మండలంలోని మద్దెలబండ గ్రామ శివారులో వ్యవసాయ పనులు చేస్తున్న బడిఈడు పిల్లలను గుర్తించి వారిని పాఠశాలలో చేర్పేందుకు చర్యలు తీసుకున్నారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్, చైల్డ్‌లైన్ ఆధ్వర్యంలో పంట పొలాల్లో ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. బాలకార్మిక వ్యవస్థ చట్టరీత్యా నేరమన్నారు. పిల్లలు బడికి, పెద్దలు పనికి అనే నినాదంతో ప్రతి ఒక్కరూ పిల్లలను పాఠశాలకు పంపించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు రేణుక, ఉపాధ్యాయులు ఈరన్న, గోవిందు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలను గాలికొదిలేశారు



రోడ్లపై నిలిచిన మురుగును పరిశీలిస్తున్న సీపీఎం నాయకులు

ధరూరు: ప్రత్యేకాధికారులు ప్రజా సమస్యలను గాలికొదిలేశారని సీపీఎం జిల్లా నాయకులు ఆరోపించారు. సోమవారం మండల కేంద్రంలోని కుర్వ వీధి, ఎస్సీ కాలనీల్లో పర్యటించి ప్రజలు పడుతున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రోడ్లు, డ్రెయినేజీలు అస్తవ్యస్తంగా ఉన్నాయన్నారు. రోడ్లపై మురుగు నిలిచి దుర్వాసన వస్తోందన్నారు. దోమల ఉధృతి పెరిగి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నట్లు వాపోయారు. మురుగు కాల్వల నిర్వహణను పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. దళిత కాలనీలో 2 వేల మందికి పైగా జనాభా ఉన్నా.. 20 గుంటల స్మశాన వాటికలో ఖననం చేసేందుకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నట్లు పేర్కొన్నారు. ఇందిరమ్మ ఇళ్ల అర్హులకు అందడం లేదని, రాజకీయ జోక్యం విపరీతంగా పెరిగిందన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. రైతులకు ఎన్నడూ లేని విధంగా యూరియా కష్టాలు వచ్చాయన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మేకల నర్సింహులు, తిమ్మప్ప, మోష, ఆంజనేయులు, బాబు, రాము, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు నిరుపేదలకు వరాలు



కరపత్రాలు అందజేస్తున్న బీజేపీ నాయకులు

శాంతినగర్: కేంద్ర ప్రభుత్వం చేపడుతున్న వివిధ సంక్షేమ పథకాలు నిరుపేదలకు వరాలని బీజేపీ వడ్డేపల్లి మండల అధ్యక్షుడు నాగరాజు అన్నారు. వడ్డేపల్లి మండల పరిధిలోని బుడమర్సులో సోమవారం గడపగడపకు బీజేపీ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నరేంద్రమోదీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన వివిధ సంక్షేమ పథకాల గురించి ప్రజలకు వివరిస్తూ, కరపత్రాలు పంచారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేయలేని హామీలు ఇచ్చి ఓట్లు దండుకొని మోసం చేసిందని ఆరోపించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్‌కు ఓటు వేయకుండా బుద్ధి చెప్పాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో ఓబీసీ మోర్చా అధ్యక్షుడు పరశురాముడు, రాఘవేంద్ర, సంజన్న పాల్గొన్నారు.

సలహాలు, అభ్యంతరాల స్వీకరణ



అలంపూర్ ఎంపీడీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న సమావేశం

అలంపూర్: పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల నాయకులతో ఎంపీడీఓ పద్మావతి సోమవారం సమావేశం నిర్వహించారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ– 2025 ఎన్నికల ముసాయిదా ఓటర్ల జాబిత, పోలింగ్ కేంద్రాలు వంటి అంశాలపై చర్చించారు. అనంతర అభ్యంతరాలు స్వీకరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నరసింహ్మా, బీజేపీ మండల అధ్యక్షుడు ఈశ్వర్, సీపీఎం మండల కార్యదర్శి జీకే ఈదన్న, సీపీఐ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పెద్దబాబు, బుచ్చన్న, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీడీఓ ఆధ్వర్యంలో

కేటీదొడ్డి: పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటర్ జాబితాపై మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ రమణారావు ఆధ్వర్యంలో వివిధ పార్టీల రాజకీయ నాయకులతో సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలోని ఎంపీఓ కృష్ణమోహన్, బీజేపీ మండల అధ్యక్షుడు శ్రీపాదరెడ్డి, నాయకులు ఎర్రబీంరెడ్డి, హన్మిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బూత్‌లు వేర్వేరుగా ఏర్పాటు చేయాలి

గట్టు: ఎంపీటీసీ ఎన్నికల్లో గట్టు గ్రామ ఓటర్లు అయోమయానికి గురవుతున్నారని, పోలింగ్ బూత్‌లను వేర్వేరుగా ఏర్పాటు చేయాలని రాజకీయ పార్టీల నాయకులు కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో పోలింగ్ బూత్‌లు, ఓటర్ జాబితాపై ఎంపీడీఓ చెన్నయ్య ప్రత్యేక సమావేశం నిర్వహించారు. గట్టు–1 ఎంపీటీసీ స్థానానికి సంబంధించిన పోలింగ్ బూత్‌లను హైస్కూల్‌లో, గట్టు– 2 ఎంపీటీసీ స్థానానికి సంబంధించిన పోలింగ్ బూత్‌లను ప్రాథమిక పాఠశాలలో ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీఓ రవికుమార్, నాయకులు మహబూబ్‌పాష, మారెన్న, రామునాయుడు, కోళాయి భాస్కర్, దేవన్న తదితరులు పాల్గొన్నారు.

75 పోలింగ్ కేంద్రాలు

ఇటిక్యాల: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల నేపథ్యంలో ఉమ్మడి ఇటిక్యాల మండలంలో 75 పోలింగ్ కేంద్రాలు గుర్తించినట్లు ఎంపీడీలు అజార్ మొహియుద్దీన్, అబ్దుల్ సయ్యాద్ ఖాన్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రజా పరిషత్ కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులకు సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. ఇటిక్యాల మండలంలో 34, ఎర్రవల్లి మండలంలో 41 పోలింగ్ కేంద్రాలు గుర్తించినట్లు పేర్కొన్నారు.



గట్టులో..



కేటీదొడ్డిలో..